క్లుప్తంగా

119 మందితో పింఛన్ల పంపిణీ



సమావేశంలో మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్

ఇచ్ఛాపురం రూరల్: మండలంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు 119 మందిని ఎంపిక చేసినట్టు ఎంపీడీవో వై.వి.రాజేంద్రప్రసాద్ చెప్పారు. స్థానిక మండలాభివృద్ధి కార్యాలయంలో గ్రామ సచివాలయ, పంచాయతీ, రెవెన్యూ, వైద్యశాఖ సిబ్బందితో బుధవారం సమావేశమయ్యారు. మండలంలో 7,340 మంది పింఛన్‌దారులకు గురువారం రూ. మూడు కోట్లకు పైగా నగదును అందజేయనున్నట్టు పేర్కొన్నారు. సమావేశంలో ఉప తహసీల్దార్ సదాశివుని గురుప్రసాద్, ఈఓపీఆర్డీ సత్యన్నారాయణ, ఏపీఓ పి.శ్రీనివాసరావు, ఏపీఎం ఎస్.ప్రసాదరావు పాల్గొన్నారు.

బాలామృతం అందజేత



లబ్ధిదారులకు బాలామృతాన్ని అందజేస్తున్న ఎంపీపీ పుష్ప

ఇచ్ఛాపురం రూరల్: కె.శాసనాం అంగన్‌వాడీ కేంద్రంలో బాలామృతాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఎంపీపీ బోర పుష్ప బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిరుధాన్యాలతో తయారు చేసిన పోషకాలు బాలామృతంలో పుష్కలంగా ఉంటాయని..దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కారంగి త్రినాథ్‌రెడ్డి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా స్వదేశీ మత్స్యకార సహకార సంఘం ఎన్నిక



ఎఫ్‌డీవో సురేష్ నుంచి ధ్రువీకరణ పత్రాన్ని అందుకుంటున్న నూతన అధ్యక్షుడు కృష్ణారావు

సంతబొమ్మాళి: నౌపడ పంచాయతీ సీతానగరం స్వదేశీ మత్స్యకార సహకార సంఘ ఎన్నిక బుధవారం ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షులుగా వాడరేవు కృష్ణారావు, ఉపాధ్యక్షులుగా బచ్చల చినబాబు, కార్యదర్శిగా బచ్చల బ్రహ్మానందం, బోర్డు సభ్యులుగా లింగుడు కుమారస్వామి, బచ్చల పాండురాజు, బి.ఆదినారాయణ, నాగరాజు, ఓడరేవు సింహాచల, అప్పారావు నియమితులయ్యారు. నరసన్నపేట మత్స్యశాఖ ఎఫ్‌డీవో సురేష్ ఆధ్వర్యంలో ఎన్నిక ప్రకియ జరిగింది. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు కృష్ణారావు మాట్లాడుతూ.. రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సహకారంలో మత్స్యకారుల అభివృద్ధి, సంక్షేమానికి కృషిచేస్తామని చెప్పారు. కార్యక్రమంలో విలేజ్ మత్స్యకార అసిస్టెంట్ కల్పన, ఎంపీటీసీ సభ్యుడు బి.సుధాకర్, నౌపడ ఉప సర్పంచ్ వాడరేవు రవికుమార్ ఉన్నారు.

స్వాతంత్య్ర సమరయోధులకు ఘనంగా నివాళులు



సమరయోధుల విగ్రహాలకు నివాళులర్పిస్తున్న దృశ్యం

పలాస: భారత దేశ దాస్యశృంఖలాలను తెంచడానికి వీరోచితంగా పోరాడిన స్వాతంత్య్ర సమర యోధులు భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్, ఉద్దం సింగ్‌లకు పీడీఎఫ్ ప్రతినిధులు బుధవారం ఘనంగా నివాళులర్పించారు. పలాస మండలం మాకన్నపల్లి గ్రామంలోని వారి విగ్రహాల వద్దకు దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పీడీఎఫ్) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఉద్దంసింగ్ 84వ వర్ధంతిని పురస్కరించుకొని విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. వారి త్యాగాలను కొనియాడారు. కార్యక్రమంలో పీడీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆర్.భీమారావు, జిల్లా కార్యదర్శి సాలిన వీరాస్వామి, రాపాక చిరంజీవి, దానేసు పాల్గొన్నారు.

రిటైర్డు వీఆర్వోకు సన్మానం



హరిప్రసాద్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

సోంపేట: ఉప్పాలం వీఆర్వో జి.హరిప్రసాద్ ఉద్యోగ విరమణ చేశారు. దీంతో ఆయన్ని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సిబ్బంది దుశ్శాలువతో సత్కరించారు. ఆయన సేవలను కొనియాడారు. డిప్యూటీ తహసీల్దార్ గిరి, వీఆర్వో అసోసియేషన్ అధ్యక్షుడు జీవన్, ఆర్ఐ ఢిల్లీరావు ఉన్నారు.

ఆపన్న హస్తం



భావనపాడు గ్రామానికి చెందిన మత్స్యకారుడు బియ్యి సోమేశ్వరరావు బ్రెయిన్ ట్యూమర్ వ్యాధితో బాధపడుతున్నారు. అతనికి పూండికి చెందిన యువతరం సేవా సమితి అండగా నిలిచింది. రూ.15 వేలు ఆర్థిక సహాయం చేసి ఆదుకున్నారు. సంబంధిత చెక్కును అతని కుటుంబ సభ్యులకు అందజేశారు. సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు చింత మురళి, గొరక సునీల్, విఘ్నేష్, ఎ.లక్ష్మణరావు, సోమేశ్వరరావు పాల్గొన్నారు. -వజ్రపుకొత్తూరు



టెక్కలి మండలం పెద్దసాన గ్రామానికి చెందిన చమళ్ల సూర్యనారాయణ రైలు ప్రమాదంలో గాయపడి జిల్లా కేంద్రం శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇతని వైద్యం కోసం అక్షర ఫౌండేషన్ ముందుకొచ్చింది. రూ.19,600 సేకరించారు. ఫౌండేషన్ చైర్మన్ బొడ్డేపల్లి నేతాజీ బాధితుని సోదరుడికి ఈ మొత్తాన్ని అందజేసి ఆదర్శంగా నిలిచారు. -టెక్కలి



సోంపేట మండలం బూరగాం గ్రామానికి చెందిన లక్కోజి ఈశ్వరరావు అకాల మరణం చెందారు. దీంతో ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులు పడుతోంది. ఈ విషయం తెలుసుకున్న వజ్రపుకొత్తూరు మండలం శ్రీ కంచికామాక్షి విశ్వబ్రహ్మణ సంఘ సభ్యులు కలిసి రూ.11 వేలు సేకరించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయాన్ని అందించారు. సంఘ అధ్యక్షుడు లక్కోజి ధర్మారావు, బి.చింతామణి, కె.జగ్గారావు, ఎల్.ప్రసాద్, బుజింగరావు, కాశీ సూర్యనారాయణ ఉన్నారు. -వజ్రపుకొత్తూరు రూరల్

తల్లిపాలే.. బిడ్డకు శ్రీరామరక్ష



- నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు

ఇచ్ఛాపురం రూరల్/కంచిలి: శిశువులకు తల్లిపాల కంటే శ్రేష్టమైనవి సృష్టిలో ఏవీ లేవు. తల్లిపాలు బిడ్డకు అమృతం వంటివి. అన్ని రకాల పోషకాలు అందించి రోగాల నుంచి రక్షించే ఔషధం. తల్లిపాలతో బిడ్డకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని, వాటిలో పోషకాలు, వాటి విశిష్టతను ప్రతిఒక్కరికీ తెలియజేసేలా ఏటా తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. గురువారం నుంచి జిల్లా వ్యాప్తంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు ప్రారంభం కానున్నాయి.

వారం రోజులు అవగాహన

తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఐసీడీఎస్ అధికారులు, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది బాలింతలు, గర్భిణులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నాయి. తల్లి పాలు బిడ్డలకు ఎంత మంచిదో తెలియజేసేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నారు.

అపోహలు విడనాడాలి



పిల్లలకు పాలు ఇస్తే ఆరోగ్యం దెబ్బతింటుందని, అందం కోల్పోతామని కొంత మంది తల్లులు అపోహ పడుతుంటారు. పిల్లలకు పాలు ఇవ్వడానికే వెనుకడుగు వేస్తారు. కానీ ఇలాంటి అపోహలన్నీ విడనాడి పిల్లలకు పాలు ఇవ్వడం ఎంతో శ్రేయస్కరం

– డాక్టర్ వై.కళ్యాణి, వైద్యాధికారిని, కొళిగాం, ఇచ్ఛాపురం మండలం

అవగాహన కల్పిస్తాం



వారం రోజుల పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించేలా ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. గర్భిణులు, బాలింతలను కలుస్తూ తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తాం. తల్లికి పాలు పడేలా తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తాం.

– పురాణం నాగరాణి, ఐసీడీఎస్ సీడీపీఓ, ఇచ్ఛాపురం

బాధ్యతగా భావించాలి



పిల్లలకు ముర్రుపాలు పట్టించడం భారం అనుకోకూడదు. పుట్టిన బిడ్డకు వెంటనే పాలు పట్టించాలి. ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే తాగించాలి. ముర్రుపాలు బిడ్డకు అమృతం లాంటివి. వారోత్సవాల్లో భాగంగా ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తాం.

-టి.ఇందిర, ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారిణి, సోంపేట

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలను అందజేస్తున్న ఈశ్వరరావు తదితరులు

వజ్రపుకొత్తూరు: ప్రైవేటు కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలలు పోటీ పడుతున్నాయని గోవిందపురం పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ పుచ్చ ఈశ్వరరావు అన్నారు. గోవిందపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ప్రభుత్వం అందించిన నోట్ బుక్‌లు, పాఠ్య పుస్తకాలను బుధవారం పంపిణీ చేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి మంచి మార్కులు సాధించి కళాశాలకు పేరు తీసుకురావాలని కోరారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కర్రి రమణ, మాజీ సర్పంచ్ సీపాన గోపి, రమణమూర్తి, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న ఎస్సై కృష్ణారావు

సోంపేట: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి బారువ ఎస్సై కోడ కృష్ణారావు అన్నారు. గంజాయి వంటి మాదక ద్రవ్యాలు, కోకిన్ డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు అలవాటుపడితే ఆరోగ్యం, జీవితం నాశనం అవుతోందన్నారు. కొర్లాం గ్రామంలోని బాలక్రిష్ణ జూనియర్ కళాశాలలో బుధవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డి.లక్ష్మణరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల బారినపడి తప్పుచేసిన వాడిలా కాకుండా ఆ ఉచ్చు నుంచి తప్పించుకొని బయటపడే ప్రేరణ కలిగి ఉండాలన్నారు. వ్యసనాల బారినపడి చదువు, ఉద్యోగం, కుటుంబానికి దూరమై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని హితబోధ చేశారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, అధ్యాపక బృందం, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఆర్టీసీ ఈయూ నాయకులు



శిరీషను సత్కరిస్తున్న నాయకులు

పలాస/కాశీబుగ్గ: పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషను స్థానిక ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఆ సంఘం గౌరవ అధ్యక్షుడు దువ్వాడ శ్రీకాంత్ ఆధ్వర్యంలో శాసనాం గ్రామంలోని ఆమె నివాసంలో బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దుశ్శాలువతో శిరీషను సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ భానుమూర్తి, విజయనగరం జోనల్ సెక్రటరీ బీకే మూర్తి, శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు త్రినాథ్, కార్యదర్శి దశరధుడు, పలాస డిపో నాయకులు దిలీప్‌కుమార్, ఎం.ఎ.రాజు, ఎమ్మెస్ నారాయణ, పి.ఎల్.నారాయణ ఉన్నారు.

చెరువుల్లో చేప పిల్లల పెంపకం లీజుకు కౌన్సిల్ ఆమోదం



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రాజలక్ష్మి

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలోని ఐదు చెరువుల్లో చేపల పెంపకం కోసం లీజు హక్కుని కల్పించేందుకు బహిరంగ వేలంపాట నిర్వహించేందుకు మున్సిపల్ కౌన్సిల్ నిర్ణయించింది. మున్సిపల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. 16 అంశాలపై చర్చించారు. కోమటి, కంద్ర, బంగాళ, ఎర్ర, కృష్ణ చెరువుల్లో చేపలు పెంచి వాటిని పట్టుకునే హక్కు లీజు కోసం గతంలో ఉన్న లీజుకంటే 33.34 శాతం పెంచి వారికే ఇవ్వాలని ఇన్‌ల్యాండ్ ఫిషరీస్ కో–ఆపరేటివ్ సొసైటీస్ వారు దరఖాస్తు చేసుకున్నారు. ఈ అంశంపై సమావేశంలో వాడీవేడిగా చర్చ జరిగింది. బహిరంగంగా వేలం నిర్వహిస్తే మున్సిపాలిటీకి ఆదాయం వచ్చే అవకాశం ఉందని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు అన్నారు. టీడీపీ కౌన్సిలర్లు సమావేశం నుంచి వాకౌట్ చేశారు. దీంతో అన్నా క్యాంటీన్‌కు సంబంధించిన అంశాన్ని వాయిదావేస్తూ మిగిలిన 15 అంశాలను కౌన్సిల్ ఆమోదించింది. చెరువుల లీజు విషయంలో గతంలో నిర్వహించిన సమావేశంలో కౌన్సిల్‌ని తప్పుదోవ పట్టించారని..దీనిపై స్టాండింగ్ కౌన్సిల్‌కి క్షమాపణ చెప్పాలని మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్–2 లాబాల స్వర్ణమణి డిమాండ్ చేశారు. వైస్‌చైర్‌పర్సన్–1 ఉలాల భారతీదివ్య, కమిషనర్ ఎన్.రమేష్ ఉన్నారు.

విద్యార్థుల ఆత్మహత్యలపై విచారణ చేయాలి

- దళిత సంఘాల సంయుక్త మండలి డిమాండ్



విద్యార్థిని తల్లి అక్షిత తల్లిదండ్రులతో కలిసి ధర్నా చేస్తున్న దళిత సంఘాల జేఏసీ నాయకులు

టెక్కలి: రాష్ట్ర వ్యాప్తంగా అంబేడ్కర్ గురుకులాల్లో వరుసగా చోటుచేసుకుంటున్న దళిత విద్యార్థుల ఆత్మహత్యలపై సమగ్రమైన దర్యాప్తు చేయాలని దళిత సంఘాల సంయుక్త మండలి నాయకులు డిమాండ్ చేశారు. నందిగాం ఎస్సీ గురుకుల పాఠశాలలో నిమ్మక అక్షిత ఆత్మహత్యకు పాల్పడింది. విద్యార్థిని మృతదేహానికి టెక్కలి ఆస్పత్రిలో బుధవారం పోస్టుమార్టం నిర్వహించారు. దళిత సంఘాల నాయకుల పోస్టుమార్టం విభాగం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థిని మృతి విషయంలో సిబ్బంది నిర్లక్ష్యంపై విచారణ చేయాలన్నారు. తల్లిదండ్రులు రాక ముందే మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ఇటీవల కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా అంబేడ్కర్ గురుకులాల్లో విద్యార్థులు వరుసగా వివిధ కారణాలతో మృతి చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆత్మహత్యకు పాల్పడిన అక్షిత కుటుంబానికి రూ. 15 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, జిల్లాలోని గురుకులాల్లో పూర్తి స్థాయిలో ప్రిన్సిపాళ్లను నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు డి.గణేష్, బి.ప్రభాకర్, వై.గోపి, టి.తిరుపతిరావు, బి.ధనరాజు ఉన్నారు.

ప్రోటోకాల్ ఉల్లంఘనపై అసంతృప్తి

కంచిలి: మండలంలోని గోకర్ణపురం పంచాయతీ పరిధిలో ప్రజలచే ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులను విస్మరించి, ఎటువంటి అర్హతలు లేనివారితో ఎరువులు పంపిణీ చేయడంపై స్థానిక ఎంపీటీసీ సభ్యుడు దుర్గాసి మాధవరావు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం సాక్షితో మాట్లాడారు. తమ పంచాయతీ పరిధిలో బుధవారం వ్యవసాయశాఖ యంత్రాంగం తమకు సమాచారం ఇవ్వకుండా, ఎవరితోనో ఎరువులు పంపిణీ చేయడం ఏంటన్ని ప్రశ్నించారు. ఇటువంటి పద్ధతి మంచిది కాదని అన్నారు.

ఎస్ఎంసీ ఎన్నికలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న ఎంఈవో శివరాంప్రసాద్

కంచిలి: ఎస్ఎంసీ–24 ఎన్నికలకు అన్ని పాఠశాలల యాజమాన్యాలు సిద్ధం కావాలని మండల విద్యాశాఖాధికారులు ఎస్.శివరాంప్రసాద్, కె.చిట్టిబాబు అన్నారు. ఈ మేరకు స్థానిక మండల విద్యావనరుల కేంద్రం ఆవరణలో మండలంలోని ప్రభుత్వ యాజమాన్యాల పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. ఎస్ఎంసీ ఎన్నికలు, వాటి మార్గదర్శకాలుపై సూచనలు చేశారు. సామరస్యపూరిత వాతావరణంలో శాంతియుతంగా ఎన్నికలు పూర్తిచేయాలని సూచించారు. ఏవైనా సందేహాలు, ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఎప్పటికప్పుడు వారి ఆదేశాల మేరకు దిశానిర్దేశం చేస్తామన్నారు.

సహారా బాధితుల నిరసన



నిరసన తెలియజేస్తున్న ఖాతాదారులు, ఏజెంట్లు

కాశీబుగ్గ: తమ డిపాజిట్ల సొమ్మును తక్షణమే చెల్లించాలని సహార ఖాతాదారులు, ఏజెంట్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు పలాసలోని సహారా కార్యాలయం ఎదుట సహారా కస్టమర్స్ అండ్ ఫీల్డ్‌వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాధితులు బుధవారం నిరసన తెలియజేశారు. ఖాతాదారులు, ఏజెంట్లు మాట్లాడుతూ.. శ్రీకాకుళం రీజన్ పరిధిలో సుమారు రూ.500 కోట్లు ఇవ్వాల్సి ఉందని, సహారా సంస్థ చేసిన మోసాలను సరిచేయాలని, తమ దగ్గర ఉన్న బాండ్లను సరైనవిగా నమ్ముతూ ఆయా ఖాతాలను పరిశీలించాలన్నారు. బాధిత ఖాతాదారులు, ఏజెంట్లను ఇబ్బందులను గుర్తించి డబ్బులను కష్టమర్ల బ్యాంకు ఖాతాలో జమ చేసి న్యాయం చేయాలని కోరారు. నిరసన కార్యక్రమంలో ఆ సంఘ అధ్యక్షులు బైపల్లి సత్యరాజు, బోయిన సత్యనారాయణ, వరప్రసాద్, శ్రీనివాసరావు, బాబూరావు, డి.ఎస్.మోహన్‌రావు, సూర్యారావు, హేమచంద్ర, రూప్ సుందర్, చింతాడ మాధవరావు పాల్గొన్నారు

ఘనంగా ప్రేమ్‌చంద్ జయంతి వేడుకలు



ప్రేమ్‌చంద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

కంచిలి: ప్రముఖ కవి.. దివంగత ప్రేమ్‌చంద్ జయంతి వేడుకలను బూరగాం జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు సోమేశ్వరరావు అధ్యక్షతన బుధవారం ఘనంగా జరుపుకొన్నారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖాధికారి–2 కె.చిట్టిబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రేమ్‌చంద్ర చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన రచనల గురించి విద్యార్థులకు వివరించారు. హిందీ భాషకు రూపురేఖలు తీర్చిదిద్ది జీవం పోశారని హిందీ ఉపాధ్యాయుడు నిరంజన్ ఖడంగా అన్నారు. ఈయన 1920లో ప్రభుత్వ ఉద్యోగాన్ని వదులుకొని స్వాతంత్రోద్యమంలో పాల్గొన్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రోజారాణి, శంకరరావు, ధర్మారావు, జగన్, కాంతారావు, శిబొరాం, మోహనరావు పాల్గొన్నారు.

సారా నివారణకు సహకరించాలి



అవగాహన కల్పిస్తున్న అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఎ.బేగం

కంచిలి: నాటుసారా నివారణకు అంతా సహకరించాలని పలాస ఎస్ఈబీ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఎ.బేగం అన్నారు. కత్తివరం గ్రామంలో సోంపేట సెబ్ సీఐ ఆర్.జైభీమ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. నాటుసారా తాగడం ద్వారా చేకూరే అనర్థాలను వివరించారు. గ్రామంలో ఎవరైనా సారా విక్రయించినా, రవాణా చేసిన తమకు సమాచారం ఇవ్వాలని సీఐ జైభీమ్ కోరారు. స్థానిక పెద్ద దుర్గాసి ధర్మారావు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా వెంకటరావు బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన వెంకటరావు

ఇచ్ఛాపురం రూరల్: ఇచ్ఛాపురం మండలం నూతన తహసీల్దార్‌గా ఎన్.వెంకటరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో తహసీల్దార్‌గా పనిచేసిన ఎం.భాస్కర అప్పారావు ఇటీవల బదిలీపై వెళ్లిపోయారు. విశాఖపట్నం జిల్లాలో తహసీల్దార్‌గా పనిచేసి బదిలీపై వచ్చిన వెంకటరావుకు ఉప తహసీల్దార్‌లు సదాశివుని గురుప్రసాద్, బలివాడ శ్రీహరి, కె.సంతోష్‌లతో పాటు సిబ్బంది పూల గుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు.



కవిటి: మురళీమోహన్‌రావుకి స్వాగతం పలుకుతున్న సిబ్బంది

విధుల్లో చేరిన కవిటి తహసీల్దార్

కవిటి: కవిటి నూతన తహసీల్దార్‌గా బి.మురళీమోహన్‌రావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. ఈయన అనకాపల్లి జిల్లా మాకవరంలో ఎన్నికల సమయంలో విధులు నిర్వహించి ఇటీవల జరిగిన బదిలీల్లో ఇక్కడకు వచ్చారు.

సంక్షిప్తంగా...

జీడి పరిశ్రమలను తెరవాలి

కాశీబుగ్గ: కొద్దిరోజులు గా మూసివేసిన జీడి పరిశ్రమలను తక్షణమే తెరవాలని కాష్యూ లేబర్ అసోసియేషన్ అధ్యక్షులు అంబటి ఆనందరావు కోరారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జీడి పరిశ్రమల మూసివేతతో కార్మికులకు పనుల్లేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నా రని అన్నారు.

మను బాకర్‌కు అభినందనలు

కాశీబుగ్గ: పారిస్ ఒలింపిక్స్‌లో రెండు కాంస్య పతకాలను సాధించి భారత దేశ జెండాను రెపరెపలాడించిన యువ షూటర్ మను బాకర్ అభినందనీయురాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొర్రాయి బాలకృష్ణ అన్నారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఒకే ఒలింపిక్‌లో షూటింగ్ విభాగంలో రెండు పతకాలు సాధించిన తొలి భారతీయ మహిళగా ఆమె చరిత్ర సృష్టించారని కొనియాడారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత రేపు

టెక్కలి: టెక్కలి టౌన్–3 ఫీడర్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డీఈఈ జి.శంకరరావు బుధవారం తెలిపారు. అంజనాపురం, సవరగోపాలపురం, వీఆర్‌కే పురం, బొరిగిపేట తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరాను నిలిపి వేస్తామని.. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

విద్యార్థి దశ కీలకం

ఇచ్ఛాపురం: విద్యార్థి దశ కీలకమని జేసీఐ వ్యక్తిత్వ వికాస నిపుణురాలు ఎం.సునీత అన్నారు. ఇచ్ఛాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వోన్నత పాఠశాల, వెంకటేశ్వర ప్రైవేటు పాఠశాలలో జేసీఐ ఆధ్వర్యంలో 'లెట్స్ మేక్ ఏ డిఫరెన్స్' పేరుతో వ్యక్తిత్వ వికాస తరగతులను బుధవారం నిర్వహించాచారు. ఉజ్వల భవిష్యత్ కోసం ప్రణాళికాబద్ధంగా చదవాలన్నారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రబీన్‌కుమార్ పాడీ, ప్రభుత్వోన్నత పాఠశాల హెచ్ఎం విశ్వనాథ్, జేసీఐ జోన్ డైరెక్టర్ దూసి సంతోష్, అధ్యక్షులు షణ్ముఖరావు, ప్రతినిధులు మధుకుమార్, వెచ్చా సంతోష్, డిల్లేష్, స్వరూప్‌కుమార్ ఉన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం

టెక్కలి: కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎన్.షణ్ముఖరావు అన్నారు. టెక్కలిలో వివిధ వర్గాలకు చెందిన కార్మికులతో నిరసన కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. కార్మిక సంఘాల ప్రతినిధులు హెచ్.ఈశ్వరరావు, ఆనందరావు, ఎల్లయ్య, లక్ష్మణరావు పాల్గొన్నారు.

డెంగీ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

కాశీబుగ్గ: డెంగీ వ్యాధిపై పిల్లలు అప్రమత్తంగా ఉండాలి పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జె.వెంకటలక్ష్మి అన్నారు. డెంగీ వ్యాధిపై అవగాహన సదస్సును కళాశాలలో బుధవారం నిర్వహించారు. ఫిలిప్పీన్స్‌లో హౌస్ సర్జన్‌గా శిక్షణ పొందుతున్న జూనియర్ డాక్టర్ పి.శివమ్‌మధు పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. వైస్ ప్రిన్సిపాల్ ఎన్.గణపతి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పి.మధు, అధ్యాపకులు ఉన్నారు.